క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌పై నమ్మకం ఉంది

- ఎమ్మెల్యే కోనతో అంగన్‌వాడీ వర్కర్లు
- సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానన్న ఎమ్మెల్యే



బాపట్ల అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తమకు పూర్తి నమ్మకం ఉందని అంగన్‌వాడీ వర్కర్లు చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం బాపట్లలో ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే కోన రఘుపతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం ఉందా అని వారిని ప్రశ్నించారు. తమకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం ఉందని ముక్త కంఠంతో పలికారు. అనంతరం అంగన్‌వాడీలు తమ సమస్యలను వివరించారు. అంగన్‌వాడీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని కోన హామీ ఇచ్చారు.

నేడు భట్టిప్రోలులో వేంకటేశ్వర కల్యాణం

భట్టిప్రోలు: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం, పద్మావతి శ్రీనివాస భజన మండలి 24వ వార్షికోత్సవం గురువారం భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో జరుగుతుందని ఆర్గనైజర్స్ తూనుగుంట్ల చాముండేశ్వరి, కోట సంధ్యారాణి, బూర్లె అరుణ కుమారిలు బుధవారం తెలిపారు. అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానాలు-తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొంటారని తెలిపారు.

రీసర్వే పనులు ప్రారంభం



పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారి పా లెం గ్రామ రెవెన్యూ పరిధిలో బుధవారం రీస ర్వే పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా జగనన్న భూహక్కు భూరక్ష పనుల్లో భాగంగా డ్రోన్ ద్వారా రీసర్వే పనులను నిర్వహించారు. సర్వేయర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగనన్న భూహక్కు రీ సర్వే కార్యక్ర మం ద్వారా భూహక్కులు కలిగిన రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ యేట్ర అశ్వినిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు యేట్ర శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



రేపల్లె రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నానాటికీ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై గ్రామీణులు అవగాహన కలిగి ఉండాలని పోలింగ్ అధికారులు గుర్రం మురళీ, లచ్చి కోటేశ్వరరావులు అన్నారు. మండలంలోని పేటేరు, బేతపూడి సచివాలయ కేంద్రంలో పేటేరు గ్రామప్రజలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)పై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికలలో ఇప్పటికే ఈవీఎంలను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందని, దేశమంతటికీ ఇదే విధానంతో ఎన్నికలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఓటర్లు తమకు నచ్చిన వ్యక్తిని ఈవీఎంల ద్వారా ఎన్నుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్‌ను ఉపయోగించే విధానాన్ని వివరించారు. వీఆర్‌ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల అర్బన్: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గత కొద్ది రోజులుగా జరుగుతున్న సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా కార్యక్రమంలో బుధవారం బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు సమ్మతమైనవని, ప్రభుత్వాధికారులు వెంటనే స్పందించి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. బాపట్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి ఇమ్మడిశెట్టి సురేష్, న్యాయవాదులు బెజ్జం వెంకటేశ్వర్లు, లేళ్ళను శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం

అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పి అగ్రహారంలో వేంచేసియున్న గంగాపర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో రాత్రి లింగోద్భవ కాలంలో ప్రారంభమైన మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత విశేషంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశేష అన్నాలంకృతునిగా స్వామివారు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్తరద్వార దర్శనంతో భక్తులు బారులుతీరి దర్శించుకున్నారు. గ్రామోత్సవం జరిగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొల్లిపర ప్రసాద్ స్వామి అత్యద్భుత అలంకారం చేశారు. అర్చకులు గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య భువనగిరి వెంకట్, భీమవరపు సురేష్, గూడూరు సాయి వెంకట్, నెమలికంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, వేణుమాధవ్, శిఖరం ఫణిరాజ శర్మ, యల్లాప్రగడ వెంకటరమణ, కృష్ణసాయి పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



బాపట్లలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కోన రమాదేవి, భక్తులు



ఉత్తర ద్వార దర్శనంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

వైభవం.. ఆరుద్రోత్సవం

భట్టిప్రోలు: శివ ముక్కోటి (ఆరుద్రోత్సవం) వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రంలో వచ్చే శివముక్కోటి సందర్భంగా శైవ క్షేత్రాలలో ఉత్తర ద్వారదర్శనం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలలో వేద మంత్రాలతో నిర్వహించిన పూజలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాలకు తరలి వచ్చారు. భట్టిప్రోలు రథం సెంటర్‌లో కొలువైన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, గంగాపార్వతీ సమేత విశలేశ్వర స్వామి దేవాలయాలలో శాస్త్రోక్తంగా శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించిన అనంతరం ఆరుద్రోత్సవం జరిపించారు. దైవదర్శనం అనంతరం ఆలయ ప్రాంగణాలలో దీపారాధనలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన రాజరాజ నరేంద్రస్వామి ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు ఆమంచి సృజన్ కుమార్ నిర్వహించగా కార్యక్రమాలను కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షించారు. భట్టిప్రోలు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కొలువైన గంగాపార్వతీ సమేత నగరేశ్వరస్వామి వారిని ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే భట్టిప్రోలు మండలం ఐలవరంలో కొలువైన కామాక్షి సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాలను తుర్లపాటి మురళీకృష్ణ శాస్త్రయుక్తంగా నిర్వహించారు.

చినపరిమిలో ఉత్తర ద్వార దర్శనం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలో కొలువైన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి సందర్భంగా బుధవారం స్వామి వార్లు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజామునే భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పరమశివుడికి అభిషేకాలు..

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసియున్న గంగాభికా సమేత ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శివముక్కోటి సందర్భంగా స్వామి వారికి అన్నాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రయాగ రాంబాబు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే స్వామివారికి ఆరుద్రోత్సవం నిర్వహించి వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలతో పాటు 1001 కేజీలతో అన్నా అభిషేకం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆనందీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా చెరుకుపల్లి, కావూరు, ఆరేపల్లి శివాలయాల్లో శివముక్కోటి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గుళ్లపల్లి ఆనందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ, కమిటీ చైర్మన్ ఓగిరాల వీరాస్వామి, పలువురు గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఆనందీస్వరునికి అన్నాభిషేకంతో అలంకరణ



భట్టిప్రోలు రథం గుడిలో ఉత్తర ద్వార దర్శనంలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పెదపులివర్రులో ఉత్తరద్వార దర్శనంలో రాజరాజ నరేంద్ర స్వామి

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నిజాంపట్నం: అధ్యయనం, అధ్యాపకం సామాజిక స్పృహ అనే నినాదంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కృషిచేస్తుందని మండల విద్యాశాఖ అధికారి కె.హరిబాబు తెలిపారు. బుధవారం నిజాంపట్నంలోని మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శినిలను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ బాపయ్య, మండల అధ్యక్షుడు కె.రాజేష్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ గణేష్‌రావు, జిల్లా కౌన్సిలర్ నరేష్, ఉమ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కూచినపూడిలో ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ మురళి, సిబ్బంది

నిజాంపట్నం: చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉంటే ఇంటింటి సర్వేచేస్తున్న ఆరోగ్య కార్యకర్తల దృష్టికి తీసుకురావాలని హెల్త్ సూపర్‌వైజర్ మురళి తెలిపారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ చెవులపై, వీపుపై నొప్పిలేని బుడిపెలు ఉన్నా, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటివి, కనురెప్పలు మూతపడకపోవడం, అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు

- ఈపూరి గణేష్ గెలుపు బాధ్యత మనందరిది
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలే అభ్యర్థుల విజయానికి సోపానాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. రేపల్లె పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో బుధవారం జరిగిన రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈపూరి గణేష్ పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వై నాట్ 175 నినాదంతో సామాజిక సమీకరణాలను పాటిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్ని సామాజికవర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. సామాజిక సమీకరణాలలో రేపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎంపికైన డాక్టర్ ఈపూరి గణేష్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. డాక్టర్ ఈపూరి గణేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని జగన్‌మోహన్‌రెడ్డికి రేపల్లెను కానుకగా అందించాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న నియోజకవర్గంలోని ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. చిన్నపాటి విభేదాలను వీడి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు.



నియోజకవర్గ ఇన్‌చార్జి ఈపూరి గణేష్ పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి


జగనన్న నమ్మకాన్ని నిలబెడదాం..

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈపూరి గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో అందరం కలిసికట్టుగా విజయబాటలో పయనించాలన్నారు. నాయకులతో పాటు కార్యకర్తల సహకారం ఉంటేనే గెలుపు సుగమమౌతుందన్నారు. రానున్నది సైతం జగనన్న ప్రభుత్వమేనని, రేపల్లెలో సైతం మన జెండా ఎగరేలా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు డాక్టర్ ఈపూరి గణేష్‌ను సభాముఖంగా పరిచయం చేశారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని, ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బుధవారం బాపట్ల మండలంలోని స్టువర్టుపురం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి అభివృద్ధిని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో సైతం పారదర్శకత పాటించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. ప్రతి బిడ్డ చదువుకు అమ్మ ఒడి పేరిట ఏటా రూ.15వేలను అందిస్తున్నారన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ఒకటో తేదీ వచ్చిందంటే చాలు అవ్వతాతలకు పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కుల, మత, రాజకీయ పార్టీల కతీతంగా ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నారని, వారికి ప్రజల ఆరోగ్యం, ప్రాణాలు అవసరం లేదన్నారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం ఎవరు చేశారనేది గుర్తించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు. అనంతరం రూ. 23 కోట్ల గ్రామ అభివృద్ధి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ బాపట్ల మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, సర్పంచ్ బోగిరి ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

కర్లపాలెం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో బుధవారం కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. గ్రామస్థాయిలో జరుగుతున్న ఈ పోటీలలో గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. యాజలి, నల్లమోతువారిపాలెం, ఎంవీ రాజుపాలెం, చింతాయపాలెం, పెదగొల్లపాలెం, గణపవరం, తుమ్మలపల్లి, పేరలి, సమ్మెటవారిపాలెం పాఠశాలల క్రీడా ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. గ్రామస్థాయిలో జరుగుతున్న ఈ పోటీలలో గెలుపొందిన టీమ్‌లు మండలస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొననున్నాయి.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ యేట్ర అశ్విని రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక సౌష్టవం పెంపొందడంతో పాటు మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. విద్యతో పాటు విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. క్రీడల్లో రాణించి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోవతోటి విజయ్, కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, గుమ్మడి సీతయ్య ఉన్నారు.



యాజలి ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

చుండూరు(భట్టిప్రోలు): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చుండూరు ఎంపీడీఓ టి.సుగుణమ్మ పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా చుండూరు మండలం మండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆటల పోటీలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలసి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాలు పంచుకున్నారు. సర్పంచ్ జొన్నకూటి ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరెడ్డి, వి.ఉమామహేశ్వరరావు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు

తెనాలిరూరల్: హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు శిక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగానమ్మపేటకు చెందిన నర్రా కొండరావును 2019లో మద్యం కోసం డబ్బులు అడుగగా ఇవ్వకపోవడంతో రౌడీషీటర్ సరికొండ సూరంరాజు, మరో ఇద్దరు అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ కేసులో రాజీకి రావడం లేదని కొండలరావుపై తిరిగి 2021 జనవరిలో సూరంరాజు, అతని మిత్రుడు బాలాజీరావు పేటకు చెందిన షేక్ ఆదం షఫి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ కేసు ప్రస్తుతం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, నిందితులకు రెండేళ్ళ జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసును టూ టౌన్ పోలీసులు నమోదు చేయగా ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కోట రమేష్ బాబునాయుడు వాదించారు.

శాఖా గ్రంథాలయాలకు పోటీ పరీక్షల పుస్తకాలు

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు వచ్చినట్లు గ్రంథాలయ అధికారులు కడియాల సుజాత, బిందు మాధవి బుధవారం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం పుస్తకాలు అందజేసినట్లు వెల్లడించారు. ఇండియన్ హిస్టరీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, తదితర పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



గ్రంథాలయంలో నూతన పుస్తకాలు

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

యడ్లపాడు: మద్యం సేవించే ప్రాంతంలో జరిగిన గొడవ కారణంగా ఇద్దరు గాయపడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. .మ్రిపాలెం గ్రామానికి చెందిన కొర్రపాటి ప్రశాంత్, కొమ్మూరి ప్రేమ్‌చంద్‌లు వారి మిత్రులతో కలిసి గ్రామ శివారులోని కొండవీడు కొండల సమీపంలో మంగళవారం మద్యం సేవించేందుకు వెళ్లారు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ప్రశాంత్‌పై ప్రేమ్‌చంద్ చేయి చేసుకున్నాడు. విషయం ప్రశాంత్ కుటుంబ సభ్యులకు తెలిసి అతని తండ్రి ఏసుబాబు ఊరిలోని చర్చివద్ద ఉన్న ప్రేమ్‌చంద్‌ను ప్రశ్నించడంతో తిరిగి ఏసుబాబుపై కూడా దాడి చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

మహాయజ్ఞానికి అంకురార్పణ

తెనాలి: పట్టణంలో నూతన సంవత్సరం జనవరిలో వారంరోజులపాటు చండీసహిత హనుమదీశ్వర మహాయజ్ఞం కార్యకలాపాలకు అంకురార్పణ జరిగింది. బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా జరిగే మహా యజ్ఞానికి అవసరమైన భారీ యాగశాల నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం ప్రత్యేక పూజలు చేసి, రుత్వికుడు బ్రహ్మశ్రీ రేలంగి ఫణికుమార శర్మ పర్యవేక్షణలో నిర్మాణపనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మహాయజ్ఞం పోస్టరును ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జనవరి 6-12వ తేదీల్లో శ్రీవాసవీ అమ్మవారి ప్రాంగణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్ప దంపతులచే శ్రీచండీసహిత హనుమదీశ్వర మహాయజ్ఞం జరగనున్న విషయం తెలిసిందే. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ, ఎనిమిది గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు, హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటల నుంచి హనుమత్ సేవకుడు, తొలి సినీ నేపథ్య గాయకుడు స్వర్గీయ ఎంఎస్ రామారావు మనుమడు డాక్టర్ పి.శ్రీనివాస్‌చే సుందరకాండ పారాయణ ఏర్పాటుచేశారు. మహాయజ్ఞానికి ముందురోజు 5వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలోని రామాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నారు. వాసవీ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, శశి గ్రూప్స్ అధినేత వుప్పల వరద రాజులు, ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కొల్లా గురునాథ గుప్తా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్, తెనాలి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన 2024 సంవత్సర కాలెండరును బుధవారం తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆవిష్కరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్, తెనాలి యూనిట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సౌజన్య, ఉపాధ్యక్షులు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, అసోసియేట్‌అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.